

సాక్షి పల్నాడు

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



సాగునీటి సమాచారం
తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 6034 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 35,019 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి 36,760 క్యూసెక్కులు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది.

శతాధిక వృద్ధురాలు మృతి
చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలకు చెందిన శతాధిక వృద్ధురాలు కార్యంపూడి లక్ష్మీకాంతమ్మ (104) సోమవారం ఉదయం మృతి చెందారు. ఆమెకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



న్యూస్‌రీల్

ముగిసిన నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి పవిత్రోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలతో నిర్వహించిన ఉత్సవాలకు సోమవారం అర్చకులు పవిత్రాలు సమర్పించారు. గాలి గోపురంపై వాటిని ఉంచి ఉత్సవాలు నిర్వహించారు. పూర్ణాహుతి, శ్వేత పుష్ప గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. ఏర్పాట్లను ఈవో ఏ. రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

వినాయకుడికి 134 రకాల ప్రసాదాలు



తాడేపల్లి రూరల్: ఉండవల్లి సెంటర్‌లో శ్రీ గణేష్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహానికి సోమవారం 134 రకాల ప్రసాదాలను కమిటీ సభ్యులు తయారుచేసి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ సాధారణంగా గణేష్ ఉత్సవాలు తొమ్మిది రోజులు నిర్వహిస్తారని, తాము 15 రోజులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

రూ. 7 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ఉండవల్లి రెడ్ల రామ మందిరం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వినాయక విగ్రహ నిమజ్జనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కమిటీ సభ్యులు స్వామివారికి భక్తులు ఇచ్చిన లడ్డూ, మణిహారాలకు వేలం నిర్వహించారు. మొత్తం స్వామివారికి రూ.11.50 లక్షల ఆదాయం లభించింది. స్వామి వారికి గ్రామానికి చెందిన బత్తుల కోటేశ్వరయాదవ్ 116 కిలోల లడ్డూ ఇవ్వగా, ఇదే గ్రామానికి చెందిన శ్రీసాయి కృష్ణ స్వీట్స్ అధినేత నల్లగొర్ల గంగాధర్‌రావు కుమారులు శ్రీనివాసరావు యాదవ్, బాలాజీ యాదవ్, తిరుమలరావు యాదవ్‌లు రూ. 7 లక్షలకు పాటలో దక్కించుకున్నారు. మరో ఐదు కిలోల లడ్డూను గ్రామానికి చెందిన మున్నంగి శ్రీధర్‌రెడ్డి రూ.35 వేలకు దక్కించుకున్నారు.

నర్సరీల హబ్‌గా రెంటచింతల

- గతంలో అత్యధిక ఉష్ణోగ్రతల నమోదుకు పేరెన్నిక
- ప్రస్తుతం నారు కోసం క్యూ కడుతున్న రైతులు
- అందుబాటులో అన్ని రకాల కంపెనీల హైబ్రిడ్ మిర్చి మొక్కలు
- 47 నర్సరీలలో ఏటా కోట్ల సంఖ్యలో మిర్చి మొక్కలు ఉత్పత్తి, విక్రయం
- వందలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి

నాణ్యమైన మిర్చి నారుకు కేరాఫ్



రెంటచింతల నర్సరీలో పెంచుతున్న మిర్చి నారు



సాక్షి, నరసరావుపేట/ రెంటచింతల: రోళ్లు పగిలే ఎండలే కాదు... నోట్లో పెట్టుకున్నంతనే మంట పుట్టించే మేలు రకమైన మిర్చి పంటకు కావాల్సిన నారుకు కేరాఫ్‌గా రెంటచింతల నిలిచింది. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా రెంటచింతలలో 47 మిరప నారు నర్సరీలు పనిచేస్తున్నాయి. రైతులకు ఇక్కడ అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన పలు రకాల హైబ్రిడ్ మిర్చి నారు ఒకే చోట దొరుకుతుంది. దీంతో రాష్ట్రంలోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాల రైతులే కాక తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, వరంగల్ తదితర జిల్లాలు, కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన రైతులు రెంటచింతల నర్సరీలలో పెంచుతున్న మిర్చినారును కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలోనే మిర్చి పంట సాగుకు ఈ ప్రాంతానికే ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇప్పుడు నర్సరీల ద్వారా అనేక ప్రాంతాలకు మేలు రకాలైన మిర్చినారును సరఫరా చేసే కేంద్రంగా మారింది.

రైతులే నర్సరీ నిర్వాహకులు...
గతంలో మిర్చి పంట పండించిన రైతులు తమ కోసం మిరపనారు సాగు చేసుకునేవార. ఈ ప్రాంతంలో సాగు చేసే నారు నాణ్యత బాగుండటంతో ఇతర ప్రాంతాల నుంచి మిరపనారు కోసం రైతులు వచ్చేవారు. ఇది గమనించిన కొందరు రైతులు నర్సరీలను ఏర్పాటు చేశారు. 2006 సంవత్సరంలో మొదట మూడు, నాలుగు నర్సరీలు ఏర్పాటు చేయగా, ఉద్యాన శాఖాధికారులు ఇక్కడ రైతుల్లో అవగాహన కల్పించిన కారణంగా మూడు సంవత్సరాలలో నర్సరీల ఏర్పాటుకు రైతులు ఉత్సాహం చూపారు. సుమారు 200 ఎకరాలలో 47 నర్సరీలు ఏర్పాటు చేశారు. వీటి వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి జీవనోపాధి లభిస్తోంది. నర్సరీలను నిర్వహిస్తున్నది రైతులే కావడంతో లాభాపేక్ష కన్నా నారు నాణ్యతపైనే దృష్టి పెడుతున్నామని నిర్వాహకులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు, చీడపీడలను తట్టుకునే కొత్త రకం మిర్చి వంగడాల విత్తనాలు వినియోగించి నారు పెంచుతున్నారు. దీంతో రైతులకు తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు వస్తున్నాయి.

వ్యవసాయం చేసిన అనుభవంతో...



నాకు వ్యవసాయం చేసిన అనుభవం ఉంది. 13 సంవత్సరాల కిందట ఇక్కడ 8 ఎకరాలలో నర్సరీలు ఏర్పాటు చేశా. ఎకరాకు సుమారు రూ.15 లక్షల పెట్టుబడి అయింది. నర్సరీలు ఎక్కువ కావడం కారణంగా కొంత డిమాండ్ తగ్గింది. వాతావరణం అనుకూలంగా లేకపోవడం, మిర్చి పంటకు గిట్టుబాటు కూడా లేకపోడంతో రైతులు పంటను సాగుచేయడానికి గతంలోలాగా ముందుకురావడం లేదు. ఈ ఏడాది నర్సరీల పరిస్థితి ఏమి బాగాలేదు.

–గోగిరెడ్డి బాలరెడ్డి, నర్సరీ నిర్వాహకులు, రెంటచింతల

రైతుల నమ్మకంతో ఆదరణ



రెంటచింతల నర్సరీలు అందించే మిరప నారు చాలా నాణ్యతతో ఉంటుంది. దీంతో ఇక్కడి నర్సరీలకు బాగా డిమాండ్ ఉంది. పదిహేనేళ్లుగా ఈ ప్రాంత నారు కోసం ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు నమ్మకంతో వస్తున్నారు. అన్ని రకాల హైబ్రిడ్ మిరపనారు మా వద్ద అందుబాటులో ఉంటున్నాయి. ఈ ఏడాది మిర్చి నారుకు పలు రకాల తెగుళ్ల సోకడంతో నర్సరీల నిర్వహణ ఖర్చు బాగా పెరిగింది.

–కొమ్మారెడ్డి జోసఫ్‌రెడ్డి, నర్సరీ నిర్వాహకులు, రెంటచింతల

నిర్వాహకులు రైతులు కావడంతో నమ్మకం



రెంటచింతలలో తక్కువ ఖర్చుతో నమ్మకమైన మేలు రకమైన నారు దొరుకుతుంది. మా ప్రాంతంలో మిర్చినారును పెంచుకునే విధానంపై రైతులకు ఇప్పటికీ అవగాహన లేదు. రెంటచింతలలో ఎక్కువ నర్సరీలు ఉండటం కారణంగా రెండు, మూడు రకాల మేలు రకాలైన హైబ్రిడ్ మిర్చి నారును కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. అందుకే ఆరేళ్లుగా ప్రతి ఏటా ఇక్కడకు వచ్చి మిర్చినారు కొనుగోలు చేస్తున్నాం. నిర్వాహకులు రైతులే కావడంతో మాకు నమ్మకం పెరిగింది.

–మీరావత్ రమేష్‌నాయక్, జిలకర్రకుంట తండా, అడవిదేవులపల్లి మండలం, నల్గొండ జిల్లా

ప్రభుత్వం పునరాలోచించాలి



వైద్య కళాశాలలను ప్రైవేటీకరించటం, సీట్లను తిరస్కరించటం మా లాంటి విద్యార్థులకు నిరాశే. ఎంతో కష్టపడి నీట్ పరీక్షలు రాసి మంచి ర్యాంకులు సాధించినప్పటికీ సీటు వస్తుందో, రాదో తెలియక ఆందోళన చెందుతున్నాం. కేటగిరీల వారీ కాకుండా అన్ని సీట్లు ఫ్రీ సీట్లుగా కేటాయించి నీట్‌లో ర్యాంకులు సాధించిన వారందరికీ సీట్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలి.

- మామిడిబత్తుల స్వామి అయ్యప్ప, నీట్ రాసిన విద్యార్థి, మచిలీపట్నం



ప్రైవేటు పరం చేయటం అన్యాయం



ప్రభుత్వ వైఖరి మారాలి వైద్య విద్య పేద విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మెడికల్ కాలేజీల ఏర్పాటుకు కృషి చేశారు. అయితే ఇప్పుడు మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయటం చాలా అన్యాయం. మంజూరైన సీట్లు వదిలేశారు. పేద విద్యార్థులు వైద్య విద్య ఎలా చదవగలుగుతారు..? ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలి.

- సమీర్ అహ్మద్, విద్యార్థి, కానూరు

జిల్లాలో స్మార్ట్ మీటర్లు రంగ ప్రవేశం

- నరసరావుపేటలో 200 మీటర్లు ఏర్పాటు
- మొదటి ఫేజ్‌లో ప్రభుత్వ కార్యాలయాలు, వీధిలైట్ల అవసరాలకు ఏర్పాటు
- తొలుత సింగిల్ ఫేజ్ మీటర్ల బిగింపు, త్వరలో త్రీఫేజ్ రాక



పట్టణంలో వివిధ ప్రదేశాల్లో బిగించిన స్మార్ట్ మీటర్లు

నరసరావుపేట: జిల్లాలో వినియోగదారులు వాడుకునే విద్యుత్ సామర్థ్యాన్ని కొలిచి తగిన సొమ్ము చెల్లించేందుకు స్మార్టు మీటర్లు రంగ ప్రవేశం చేశాయి. ఇప్పటివరకు వినియోగిస్తున్న ఐఆర్‌డీ మీటర్లకు కాలం చెల్లనుంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సర్వీసులకు మాత్రమే సింగిల్ ఫేజ్ స్మార్టు మీటర్లు ఆశాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. నరసరావుపేట పట్టణంలో సుమారు 200 సర్వీసులకు ఏర్పాటు చేశారు. మరో 800 వరకు బిగించాల్సి ఉందని చెబుతున్నారు. ఈ మీటర్లలో సిమ్ ఉంటుంది. సెల్‌ఫోన్ల మాదిరిగానే ముందుగానే డబ్బులు చెల్లించి వాటిని వినియోగించుకునే అవకాశం భవిష్యత్‌లో వినియోగదారులకు కలుగుతుంది. దీంతోపాటు అధికారులకు వినియోగదారుడు ఏ మేర విద్యుత్ వినియోగిస్తున్నాడనే విషయం ప్రతి అరంగటకు అతనికి, అధికారులకు సమాచారాన్ని అందజేస్తుంది. ప్రతి నెలా మీటరు వద్దకు వచ్చి రీడింగ్ తీసుకునే అవసరం విద్యుత్ సిబ్బందికి తప్పుతుంది. ప్రస్తుతమైతే పాత పద్ధతి పోస్ట్‌పెయిడ్‌లోనే బిల్లు చెల్లించుకుంటారు. రానున్న రోజుల్లో ప్రీపెయిడ్ విధానంలో ముందస్తుగా డబ్బులు చెల్లించి రీచార్జి చేసుకొని విద్యుత్‌ను వాడుకునే అవకాశం ఉంటుంది. ఈ మీటర్లను ఆదాని గ్రూప్ ద్వారా ప్రభుత్వానికి సరఫరా అవుతున్నాయి. తొలుత ప్రభుత్వం కార్యాలయాలు, వీధిలైట్లు, ఇతర ప్రభుత్వ వాడకాలకు ఉపయోగించేందుకు ఏర్పాటుచేస్తున్నారు. ఆ తర్వాత గృహవసరాలకు ఏర్పాటు చేస్తారు. అయితే ప్రస్తుతం సింగిల్ ఫేజ్ మీటర్లనే బిగిస్తున్నారు. త్వరలో త్రీ ఫేజ్ మీటర్లు కూడా రానున్నాయి. దీనిపై ఏడీఈ ఏడుకొండలను వివరణ కోరగా స్మార్టు మీటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ ముందుగా డబ్బులు చెల్లించి దానికి తగ్గట్టుగా విద్యుత్‌ను వాడుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

నిమజ్జనంలో టీడీపీ శ్రేణుల అరాచకం

- ఎమ్మెల్యే చదలవాడ ఆధ్వర్యంలో వినాయక విగ్రహ ఏర్పాటు
- రెడ్డినగర్ వద్ద రెచ్చిపోయిన తమ్ముళ్లు
- పోలీసుల సమక్షంలో దాడులు
- ప్రేక్షక పాత్ర వహించిన పోలీసులు



రెడ్డినగర్ వద్ద దాడికి పాల్పడుతున్న తెలుగు తమ్ముళ్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపులో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయారు. ఈ విగ్రహం ముందుగా వెళ్తున్న మరో విగ్రహ ఊరేగింపుపై దాడులకు పాల్పడ్డారు. పోలీసుల సమక్షంలోనే వారి లాఠీలతోనే దాడులకు తెగబడ్డారు. భయభ్రాంతులకు గురైన స్థానికులు పరుగులు తీశారు. చివరకు పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. టీడీపీ శ్రేణుల దాడిలో పలువురికి గాయాలయ్యాయి.

రెచ్చిపోయిన తెలుగు తమ్ముళ్లు

నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని 60 అడుగుల రోడ్డులో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు టీమ్ ఆధ్వర్యంలో వినాయకచవితి పందిరి ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బంధువు అని చెప్పుకునే విజయ్ అంతా తానై ఏర్పాట్లు పర్యవేక్షించాడు. విగ్రహ ఏర్పాటు, ఊరేగింపునకు పట్టణంలోని ప్రముఖుల నుంచి చందాల రూపంలో భారీగా వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆదివారం ఈ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఆయన తనయుడు డాక్టర్ ఆదిత్య ఊరేగింపులో పాల్గొన్నారు. నిమజ్జన ఊరేగింపు రెడ్డినగర్ వద్దకు ఆదివారం రాత్రి 12 గంటలకు చేరింది. అదే సమయంలో రెడ్డినగర్ వినాయకుని ఊరేగింపు కూడా రావడంతో రెచ్చిపోయిన తెలుగు తమ్ముళ్లు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. బాణసంచాను ఎదుటి వినాయకుని ఊరేగింపుపై విసిరారు. రెడ్డి నగర్ కమిటీ ఊరేగింపులో ఏర్పాటుచేసిన బాణసంచాపై కారు ఎక్కించి ఆటంకం కలిగించారు. దీనిని ప్రశ్నించిన కమిటీ నిర్వాహకులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. సర్ది చెప్పేందుకు వచ్చిన పోలీసుల చేతిలో లాఠీలను లాక్కున్న టీడీపీ గుండాలు ఎదుటి వర్గంపై దాడులకు పూనుకున్నారు. పోలీసులు సర్ది చెప్తున్నా వినకుండా అప్పటికే మద్యం మత్తులో ఉన్న తెలుగు తమ్ముళ్లు బెదిరింపులకు దిగారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

వినాయక విగ్రహం ఊరేగింపు కారణంగా ప్రకాష్‌నగర్‌లో అనధికారకంగా కరెంట్ కోత విధించారు. రెండు గంటలపాటు సరఫరా నిలిచిపోయింది. ప్రకాష్‌నగర్, సాంబశివరావుపేట, శ్రీనివాసనగర్, 60 అడుగులరోడ్డు తదితర ప్రాంతాల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఊరేగింపు కారణంగా మెయిన్‌రోడ్డులో అనధికారంగా ట్రాఫిక్ ఆంక్షలు పోలీసులు విధించారు. ఊరేగింపునకు అసౌకర్యం కలుగకుండా ఎక్కడికక్కడ బారికేడ్‌లు ఏర్పాటుచేశారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు దారి మళ్లించారు. మూడు కిలోమీటర్లు తిరిగి రావిపాడు రోడ్డు చెక్‌పోస్ట్ వద్దకు చేరుకోవాల్సి వచ్చింది. కొందరు దారి తెలియక గంటల కొద్ది ట్రాఫిక్‌లో చిక్కుకొని ఉండాల్సి వచ్చింది. పల్నాడు రోడ్డులో హైదరాబాద్ వెళ్లేందుకు వేచి ఉండే ప్రయాణికులు ఈ దారిలో బస్సులు రాక పోవడంతో గంటల కొద్దీ నిరీక్షించి అసహనానికి గురయ్యారు.

బెదిరింపులకు దిగిన ఎమ్మెల్యే బంధువు
పోస్టింగ్ ఇప్పించిన నాకు తీపించడం కూడా తెలుసు.. మా వాళ్లు వెళ్లి వాళ్లపై మరో దఫా దాడి చేస్తారు. సహకరించిన వాళ్లే ఇక్కడ ఉంటారు అంటూ ఎమ్మెల్యే బంధువు బెదిరింపులకు పాల్పడ్డారు. రెడ్డినగర్ వినాయకుడి ఊరేగింపులో కమిటీ నిర్వాహకులపై దాడులకు పాల్పడిన అనంతరం టీడీపీ శ్రేణులు మరోమారు దాడులకు దిగేందుకు సిద్ధం అయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు, సిబ్బంది సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా ఎమ్మెల్యే బంధువు వారిపై నోరు పారేసుకున్నాడు. పోలీసుల వైఖరికి నిరసనగా నిమజ్జన ఊరేగింపును నిలిపివేస్తానని చెప్పడంతో అధికారులు ఆయన్ను బతిమిలాడి ముందుకు సాగించారు.



వినుకొండ రోడ్డులో ఏర్పాటుచేసిన బారికేడ్‌లు

అన్నదాతకు మరో అవకాశం

- ఈ-పంట నమోదు గడువు 23 వరకు పెంపు
- సద్వినియోగం చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు
- జిల్లాలో ఇప్పటి వరకు 92 శాతం ఈ-పంట నమోదు

సత్తెనపల్లి: అన్నదాతల నుంచి వ్యతిరేకత వస్తుందని గ్రహించిన ప్రభుత్వం ఎట్టకేలకు తలొగ్గింది. ఈ-పంట నమోదుకు గడువు ముగియడంతో వేలాది మంది రైతులు నమోదుకు దూరమయ్యారు. దీంతో అన్నదాతల నుంచి వ్యతిరేకరాకుండా ఏ ఒక్క రైతు నష్ట పోకూడదంటూ గడువును ఈనెల 23 వరకూ పెంచింది. 25 నుంచి 27 వరకు రైతు సేవా కేంద్రాల్లో జాబితాలను ప్రదర్శించి సామాజిక ఆడిట్, గ్రామసభ నిర్వహిస్తారు. ఫిర్యాదులు, అభ్యంతరాలను 28, 29వ తేదీల్లో పరిష్కరిస్తారు. తుది జాబితాను 30న ప్రకటిస్తారు. ప్రతి ఖరీఫ్, రబీలో పంటల నమోదును వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది చేపడుతున్నారు. వీటి ఆధారంగానే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటూ వస్తోంది. పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే బీమా వర్తింప చేసి పరిహారం అందిస్తుంది. పంట రుణాలపై వడ్డీ రాయితీని భరిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి
ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలి. ఈనెల 15తో గడువు ముగిసినా ప్రభుత్వం ఈనెల 23 వరకు అవకాశం కల్పించింది. అన్ని రకాల పంటల సాగును నమోదు చేయాలి.

–ఐ మురళి, జిల్లా వ్యవసాయ అధికారి, పల్నాడు



భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ
మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుంటూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

– గుంటూరు

రేపు మెగా జాబ్‌మేళా
నరసరావుపేటఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జన్‌పాక్ట్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 2022-23, 24 సంవత్సరాలలో డిగ్రీ లేదా బీటెక్ పూర్తిచేసి ఉండాలని తెలిపా రు. కంటెంట్ నియంత్రణ, కస్టమర్ సర్వీస్-వాయిస్ సపోర్ట్ ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని, హైదరాబాద్ హఫీజ్‌పేటలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 7702700990, 9160031006 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి



మృతిచెందిన వెంకటేశ్వర్లు



మృతిచెందిన టంగుటూరి కోటిలింగం

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి చెందిన సంఘటన నూజెండ్ల మండలం తెల్లబాడు సమీపంలో సోమవారం జరిగింది. సేకరించిన వివరాలు.. పమిడిపాడు నుంచి వినుకొండ వస్తున్న ఆటో మార్గంమధ్యలో తెల్లబాడు సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న రాయిపైకి టైర్ ఎక్కడంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ప్రమాదంలో పమిడిపాడుకి చెందిన పొనకాల వెంకటేశ్వర్లు (78), టంగుటూరి కోటిలింగం (77) మృతిచెందారు. ఆటోలో మరో ఎనిమిది మంది ప్రయాణికులు ఉండగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఐనవోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వినుకొండ ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

క్లుప్తంగా

ఖోఖో జట్టుకు కారెంపూడి విద్యార్థి ఎంపిక



కారెంపూడి: ఖోఖో సబ్ జూనియర్ రాష్ట్ర బాలుర జట్టుకు స్థానిక బ్రహ్మానాయుడు జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి రెయిన్ పాల్ ఎంపికయ్యాడని పాఠశాల హెచ్ఎం అనంత శివ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆదివారం బాపట్ల జిల్లా జె.పంగులూరులో నిర్వహించిన రాష్ట్ర ఖోఖో జట్ల ఎంపికలో రెయిన్‌పాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడని చెప్పారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల హాజరవుతారని తెలిపారు. జె.పంగులూరులో ఎంపికైన రాష్ట్ర జట్లకు ఈ నెల 16వ తేదీ నుంచి 26 వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, స్వర్ణరాజులను అభినందించారు.

సేవాసమితుల ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం



అమరావతి: జిల్లా వ్యాప్తంగా శ్రీసత్యసాయి సేవాసమితుల ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ఏడు వినాయక విగ్రహాలను సోమవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వైభవంగా నిమజ్జనం నిర్వహించారు. తొమ్మిది రోజులుగా గణపతి నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించారు. జిల్లాలో సత్యసాయి శాంతిసుధ జిల్లా పరిషత్ ప్రాంగణం, బైపాస్ రోడ్డులోని ఆధ్యాత్మిక సామ్రాజ్యం నుంచి, దుగ్గిరాల, చిలకలూరిపేట, అచ్చంపేట, అమరావతి గ్రామాల సత్యసాయి సేవాసమితుల విగ్రహాలు అమరావతిలో నిమజ్జనం చేశారు. తొలుత సత్యసాయి సేవాసమితుల ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను స్థానిక త్రిశక్తి పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమరేశ్వరా స్నానఘట్టం వరకు ఊరేగింపుగా తెచ్చి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

గణేష్ ఉత్సవాల్లోనూ టీడీపీ బరితెగింపు

- ఊరేగింపు చేయకుండా ట్రాక్టర్లు, ట్రక్కులతో అడ్డగింపు
- దాడి చేసేందుకు కారం, రాడ్లు, రాళ్లు, కర్రలతో సిద్ధం
- టీడీపీకే వంతపాడిన పోలీసులు
- నిమజ్జనం విరమించుకున్న వైఎస్సార్ సీపీ మద్దతుదారులు
- అచ్చంపేట మండలం గంథశిరిలో ఘటన



దారికి అడ్డంగా ట్రాక్టరు ట్రక్కులు అడ్డు పెట్టిన టీడీపీ కార్యకర్తలు



వినాయక విగ్రహాన్ని ట్రాక్టరుపై ఎక్కిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నరసరావుపేట: అధికారమే హద్దుగా టీడీపీ బరితెగిస్తోంది. ఇప్పటి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారు. చివరికి వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహ ఊరేగింపు అడ్డుకున్నారు. నిమజ్జనానికి వెళ్లే దారికి అడ్డంగా ట్రాక్టర్లు, ట్రక్కులు అడ్డుపెట్టారు. కాదని వస్తే సహించేది లేదంటూ కర్రలు, రాళ్లు, రాడ్లు పట్టుకుని దాడులకు సిద్ధపడ్డారు. ఆఖరుకు నిమజ్జనోత్సవం సందర్భంగా నిర్వహించే అన్నదాన సంతర్పణకు కూడా భక్తులను వెళ్లనీయలేదు. ఘటన పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం గ్రంథశిరి గ్రామంలో చోటుచేసుకుంది. వినాయక చవితి పురస్కరించుకుని గ్రామాలో వైఎస్సార్ సీపీ, టీడీపీ మద్దతుదారులు ఎప్పటిలాగానే వినాయకుడి విగ్రహ మండపాలు ఏర్పాటు చేసుకున్నారు. తొమ్మిది రోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్న తరువాత నిమజ్జనానికి ఇరువర్గాలు ఒకేరోజు అంటే ఆదివారం అనుమతి కావాలంటూ పోలీసులను కోరారు. పోలీసులు ముందుగా టీడీపీ వారికి అనుమతి ఇవ్వడంతో ఆదివారం సాయంత్రం డీజే సౌండ్స్, బాణసంచా, తీన్‌మార్ డప్పులతో గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేసుకున్నారు. వైఎస్సార్ సీపీ వారిని సోమవారం నిమ జ్జనం చేసుకునేందుకు అనుమతించారు. ఈ క్రమంలో కొంతమంది టీడీపీ వర్గీయులు తమ ఇళ్లపై రాళ్లు రువ్వి గులాంలో కారం కలిపి చల్లారని, వైఎస్సార్ సీపీ వర్గీయులు ఘర్షణకు దిగారు. ఇంతలో పోలీసులు రావడంతో గొడవ సద్దుమణిగింది.

వినాయకుడి నిమజ్జనానికి తరలిస్తుండగా..

సోమవారం ఉదయాన్నే వైఎస్సార్ సీపీ వర్గీయులు వినాయకుడిని నిమజ్జనం చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. టీడీపీ వాళ్లు చేసుకున్న విధంగానే డీజే సౌండ్స్, బాణసంచా, తీన్‌మార్ డప్పులను సిద్ధం చేసుకున్నారు. వినాయడిని మండపంలో నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టరుపై ఎక్కించి ప్రధాన వీధిలోనుంచి ఊరేగింపుగా వెళ్లేందుకు సిద్ధపడ్డారు. అంతే ఊరేగింపునకు వెళ్లకుండా ప్రధాన రహదారికి అడ్డంగా ట్రాక్టరు ట్రక్కులను టీడీపీ వర్గీయులు అడ్డు పెట్టారు. గొడవకు ముందుగానే సిద్ధపడ్డ టీడీపీ వారు తమ పలుకుబడితో అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, సీఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో పోలీసు బలగాలను మోహరింపజేశారు. టీడీపీ వర్గీయులు కూడా గ్రామోత్సవాన్ని అడ్డుకునేందుకు దారికి అడ్డంగా ట్రాక్టర్లు, ట్రక్కులు అడ్డంపెట్టి అవతలివైపు కర్రలు, రాడ్లతో కాపుకాశారు. ఊరేగింపు నిర్వహించాల్సిందేనని వైఎస్సార్ సీపీ వర్గయులు కూడా భీష్మించుకూర్చున్నారు. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి కూడా వెళ్లకుండా టీడీపీ వారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిపై పోలీసులు కూడా టీడీపీకే వంత పలకడంతో చేసేది లేక వైఎస్సార్ సీపీ మద్దతుదారులు మేము మా ప్రభుత్వం వచ్చేంతవరకు ఐదేళ్లు పూజలు నిర్వహించుకుని అప్పుడే నిమజ్జనం చేసుకుంటామంటూ నిమజ్జనోత్సవాన్ని విరమించుకుని వినాయక నిమజ్జనోత్సవానికి ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక వాహనంపై నుంచి దించి యథావిధిగా మండపంలో ఉంచారు.

మీరు వేరే దారిన వెళ్లకుంటే కేసులు: లక్ష్మీపతి, అడిషనల్ ఎస్పీ

గ్రామంలో గొడవలు వద్దు. మీకు డీజే పెట్టుకునేందుకు, బాణసంచాతో ఊరేగింపు చేసుకునేందుకు అనుమతి లేదు. వేరే దారిన ప్రశాంతంగా వెళ్లి నిమజ్జనం చేసుకోవాలి. లేకుంటే వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు తప్పవు. భిన్నంగా చేస్తే నిర్వహక కమిటీ పాటు సపోర్టు చేసిన అందరిపై కేసులు నమోదు చేస్తాం. కేసులుంటే వీసాలు కూడా రావు, బ్యాంకుల్లో రుణాలు కూడా ఇవ్వరు. మీరు తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మీరు చట్టాన్నే మార్చేంత వ్యక్తులేం కాదుగా, మిమ్మల్ని కంట్రోల్ చేయడానికి మేం ఇంతమందిమి రావాలా... పంతాలు, పట్టింపులు వద్దు, మేము చెప్పినట్లుగా వినండి. వాళ్లు వద్దన్న దారినే మీరు ఎందుకు వెళ్లాలి, డీజే సౌండ్స్ లేకపోతే వినాయకుడు ఒప్పుకోడా, మర్యాదగా నేను చెప్పినట్లు వేరే దారిని వెళ్లి నిమజ్జనం చేసుకోవాలి. ఈసారికి ఇలా పోనివ్వండి, వచ్చే ఏడాది ఇరువర్గాలను కూర్చోబెట్టి ఎలా చేయాలో ఆలోచిద్దాంలే అని అడిషనల్ ఎస్పీ అన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఏర్పాటు చేసుకున్న విగ్రహం నిమజ్జనానికి వెళ్లకుండా వెనుదిరిగారు.



వైఎస్సార్ సీపీ వర్గీయులతో చర్చిస్తున్న పోలీసులు

ముగిసిన అమరావతి నృత్యోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నగరంపాలెం: రెండు రోజులుగా కేఆర్‌కేఎం మెమోరియల్ అకాడమీ అఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న ఎనిమిదో అమరావతి నృత్యోత్సవం–2024 (భారతీయ నాట్య రీతుల సమ్మేళనం) సోమవారంతో ముగిసింది. ప్రత్యేక అతిథిగా చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, నాట్యగురు ఎన్.బాలసుబ్రహ్మణ్యాచారి, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, పూటుకూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు ఏపీ స్టేట్ నాటక అకాడమి వైస్‌చైర్మన్ డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. అనంతరం కె.సంధ్యారాణి(హైదరాబాద్) కూచిపూడి నృత్యం, ఎం.శ్రీవల్లీరావు (హైదరాబాద్) కథక్ నృత్యం, గరిణే సంతోష్‌కుమార్, గరిణే సాయికుమార్ (సూర్యా పేట) పేరిణి నృత్యం, సి.శ్రీనర్తన (హైదరాబాద్) ఆంధ్ర నాట్యం అలరించాయి. హైదరాబాద్ కళాకారుల నాట్యంశాలు అబ్బురపరిచాయి. ఎనిమిదేళ్లుగా ఒకే వేదికపై నృత్య ప్రదర్శనలను ప్రదర్శిస్తున్న అకాడమీ నిర్వాహకులను అతిథులు అభినందించారు. ఈసందర్భంగా కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కోకా విజయలక్ష్మి, సమన్వయకర్త జి.రవి, డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు

ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయకుమారి



తవ్వకాలు జరిపిన గుంతలను పూడ్చివేయిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

బెల్లంకొండ: అటవీ ప్రాంతాల్లో గుప్త నిధుల తవ్వకాలు, వజ్రాల వేట, అడవులను నరికి వేయడం వంటి అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయకుమారి తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం కోళ్లూరు రోడ్డులోని అటవీ ప్రాంతంలో గుప్త నిధుల తవ్వకాలపై ఈ నెల 11న సాక్షి పత్రికలో 'గుట్టుగా గుప్తనిధుల తవ్వకాలు' పేరుతో ప్రచురితమైన కథనానికి అటవీ శాఖ అధికారులు స్పందించారు. జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.రామచంద్రరావు ఆదేశాల మేరకు వెంటనే తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికంగా ఉన్న గ్రామస్తులను విచారించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిధుల కోసం అటవీ ప్రాంతంలో తవ్విన గుంతను అటవీ సిబ్బంది పూడ్చి వేశారు. రేంజ్ అధికారి మాట్లాడుతూ అనుమతులు లేకుండా అటవీ ప్రాంతాల్లోకి కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో గుప్తనిధులు, వజ్రాలు దొరుకుతాయన్న ఆశతో వచ్చి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పేర్కొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపుదలకు కృషి చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. పల్నాడు బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమానికి బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న 67 మందిని అభినందించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన అందించినప్పుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడు సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దగలరని అభిప్రాయపడ్డారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కాలువలో పడి వివాహిత మృతి

నకరికల్లు: ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తూ కాలువలో పడి వివాహిత మృతి చెందింది. ఘటన నకరికల్లు పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాలు.. నకరికల్లు ఇందిరమ్మ కాలనీకి చెందిన కుంచా వెంకటరామిరెడ్డి అతని భార్య శివ(28) కలసి ద్విచక్రవాహనంపై శ్రీరాంపురంలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. మార్గంమధ్యలో బీబీసీ కెనాల్ కాలువ కట్టపై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరు కాలువలో పడిపోయారు. భర్త వెంకటరామిరెడ్డి బయటకు రాగా భార్య కాలువ నీటి ప్రవాహానికి గల్లంతైంది. మృతురాలి తండ్రి రమణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఒక కుమార్తె ఉంది.

బ్రాహ్మణులలో ఐకమత్యం అవసరం



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న సంఘ నాయకులు

అమరావతి: బ్రాహ్మణులు అభివృద్ధి చెందాలంటే ఐకమత్యంగా ముందుకు సాగాలని అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాదశర్మ అన్నారు. సోమవారం స్థానిక యోగాశ్రమంలో నిర్వహించిన అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం పల్నాడు జిల్లా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ప్రధానకార్యదర్శి దేవళ్ల వసంత సాయినాథశర్మ అధ్యక్షత వహించారు. ఇంద్రకంటి ప్రసాదశర్మ మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలలో అఖిలభారతీయ బ్రాహ్మణ మహాసంఘం బ్రాహ్మణుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. సంస్థ తరపున ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి బ్రాహ్మణ యువత కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఉద్యోగ మేళా నిర్వహించటానికి నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ ఉద్యోగ మేళాలో సుమారు 150 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కలిపించే విధంగా కార్యక్రమాలు రూపొందించినట్లు చెప్పారు.

జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

పల్నాడుజిల్లా మొదటి సమావేశంలో అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కౌశిక వేంకట నాగ మల్లేశ్వర ప్రసాదశర్మతో పాటుగా జిల్లా కార్యవర్గసభ్యులతో రాష్ట్ర అధ్యక్షులు ఇంద్రకంటి ప్రసాదశర్మ ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా సభ్యులందరికీ సంస్థ గుర్తింపుకార్డులను అందజేశారు. తొలుత బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం నిర్వహించి శోభాయాత్రగా బ్రాహ్మణులందరూ యోగా శ్రమానికి చేరుకున్నారు. సభలో కోశాధికారి ఆసుండి హనుమాన్ శాస్త్రి, సౌత్ జోన్ కోఆర్డినేటర్ ప్రతాపగిరి సునీల్ కుమార్ శర్మ, సౌత్ జోన్ 4 కో ఆర్డినేటర్ శ్రీశర్మ, రాష్ట్రస్థాయి టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ లంకా ప్రసన్న కుమారశర్మ, ఎండ్రాయి వేద పాఠశాల నిర్వాహకుడు ఘంటశాల చంద్రమౌళీశ్వరశర్మ ప్రసంగించారు.

మెగా రక్తదాన శిబిరాలు విజయవంతం చేయండి

- నేడు రెడ్‌క్రాసు సొసైటీ ఆధ్వర్యంలో మూడు చోట్ల ఏర్పాటు
- జిల్లా చైర్మన్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న రెడ్‌క్రాసు సొసైటీ చైర్మన్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సహకారంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గుంటూరు రోడ్డులోని కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియం, వాగ్దేవి డిగ్రీ కాలేజీ ఆవరణ, కాకాని గ్రామం వద్దనున్న జేఎన్టీయూ కళాశాలలో ప్రత్యేక రక్తదాన శిబిరాలు జరుగుతాయని చెప్పారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు చైర్మన్ వడ్లమాని రవి, వైస్ చైర్మన్ పీఆర్‌సీ రాజు సహకారం అందిస్తున్నారని అన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా వాసవి, రోటరీ, లయన్స్ క్లబ్‌లకు చెందిన ప్రతినిధులు, ఇతర సేవా సంస్థల సభ్యులు అందరూ పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యులు డాక్టర్ సృజన, డాక్టర్ రెహమతుల్లా, మురళి, శ్రీనివాసగుప్తా, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

సెల్ ఫోన్ సర్వీసింగ్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 14నుంచి సెల్‌ఫోన్ రిపేర్ అండ్ సర్వీసెస్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు సెల్‌ఫోన్ సర్వీసింగ్, టైలరింగ్‌ను యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. 10వ తరగతి పాస్/ ఫెయిల్ అయిన 19 నుంచి 45 సంవత్సరాలలోపు అర్హులని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఫొటోస్టాట్లతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, గుంటూరు లేదా 0863–2336912, 9700687696, 8125397953, 9949930155 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

విధులు బహిష్కరించిన స్టాఫ్ నర్సులు

- జీజీహెచ్‌లో 12వ రోజుకు చేరుకున్న నిరసన
- నల్ల బ్యాడ్జీలు ధరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ప్రదర్శన




ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు సోమవారం విధులు బహిష్క రించి నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిల బడి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. తమ ను రెగ్యులర్ చేసే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ఇవ్వకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయా రు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే మంగళవారం నుంచి అత్యవసరం మినహా సాధారణ వైద్యసేవలన్నీ బంద్ చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్య, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

పీడియాట్రీషియన్‌గా సేవలందిస్తా !

- నీట్‌లో 720కి 551 మార్కులు సాధించిన నగరానికి చెందిన రీతూ జన్నీ
- ప్రభుత్వ కళాశాలలో మెడికల్ సీటు



నెహ్రూనగర్: డాక్టర్ కావాలన్న కల ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఆ అదృష్టం కొంత మందికి మాత్రమే దక్కుతుంది. గుంటూరు నగరానికి చెందిన పేరికలపూడి రీతూ జన్నీ నీట్ పరీక్షల్లో 720 మార్కులకు గాను 551 సాధించి ప్రభుత్వ సీటు దక్కించుకుంది. తండ్రి రమేష్ గుంటూరు నగరపాలక సంస్థ స్కూలులో హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. నీట్‌లో ర్యాంకు సాధించడంలో తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని రీతూ జెన్నీ చెప్పారు. ఈమని దళితవాడకు చెందిన ఆమె 10వ తరగతిలో 10/10 మార్కులు సాధించింది. ఇంటర్‌లో 1000/973 సాధించి అందరి మన్ననలు పొందింది. చిన్నప్పటి నుంచి డాక్టర్ అవ్వాలనే కోరికతో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంది. మొదటి ప్రయత్నంలోనే 720 మార్కులకు 551 మార్కులు సాధించింది. నేడు ప్రభుత్వ సీటు దక్కించుకోవడంపై పలువురు దళిత సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- ఒకరి మృతి.. 15 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- నిమజ్జనానికి వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మరో వాహనం
- నారాకోడూరు సమీపంలో దుర్ఘటన



బోల్తా పడిన వాహనాన్ని లేపుతున్న భక్తులు

చేబ్రోలు: వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుంది. రెండు వాహనాలు ఢీకొని ఒకరి మృతి చెందగా, 15మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు సంపత్‌నగర్, ఐపీడీ కాలనీలకు చెందిన భక్తులు రెండు భారీ వినాయక విగ్రహాలను నిమజ్జనానికి ట్రాక్టర్, మినీ వ్యాన్‌లో విడివిడిగా చేబ్రోలు మండలం సంగం జాగర్లమూడి వద్ద కొమ్మమూరు చానల్‌కు తెచ్చారు.

మార్గంమధ్యలో మండల పరిధిలోని నారాకోడూరు కామధేను ఫీడ్స్ సమీపంలోని మినరల్ వాటర్ ప్లాంట్ ఎదురుగా అప్పటికే నిమజ్జనం నుంచి తిరిగి వస్తున్న మినీ వ్యాన్‌ను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ రెండు వాహనాల్లో సుమారు 50మంది వరకు నిమజ్జనానికి వచ్చిన భక్తులు ఉన్నారు. ఈ సంఘటనలో రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. ప్రమాద సమయంలో భక్తులు హాహాకారాలు మిన్నంటాయి.

నిమజ్జనానికి వచ్చి అనంత లోకాలకు..



తీవ్రంగా గాయపడిన వినయ్‌కుమార్

ప్రమాదంలో గుంటూరు నల్లచెరువుకు చెందిన వేముల శివశంకర్(26) ప్రాణాలు కోల్పోయాడు. తొలుత గాయపడిన అతడిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదంలో రెండు వాహనాల్లోని 15 మందికి గాయాలయ్యాయి. ఐపీడీ కాలనీకి చెందిన తేజకు కణితకు, ముఖానికి, కాళ్లు చేతులకు, సంపత్ నగర్‌కు చెందిన వినయ్, కృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను మూడు అంబులెన్స్‌లలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు, వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు